చిరువ్యాపారులకు ఎల్లప్పుడు అండగా ఉంటాం



చిరు వ్యాపారులతో మాట్లాడుతున్న టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్‌మధుయాష్కిగౌడ్

ఎల్‌బీనగర్: చిరు వ్యాపారులకు ఎల్లప్పుడు అండగా ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధయాష్కిగౌడ్ తెలిపారు. ఎల్‌బీనగర్‌లో నిర్మాణ సామగ్రి వ్యాపారం చేసుకునే నిర్వాహకులు గురువారం మధుయాష్కిగౌడ్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. ఎస్‌ఓటీ పోలీసులు దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నారని, పలువురు పోలీసులు వేధింపులకు గురి చేస్తున్నారని ఆయన వివరించారు. పలు ప్రాంతాలను ఇసుకను కొనుకొచ్చి రిటైల్‌గా విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నామని పోలీసులు పెడుతున్న ఇబ్బందులతో వ్యాపారం చేసుకునే పరిస్థితి లేదని అన్నారు. అనంతరం మధుయాష్కిగౌడ్ మాట్లాడుతూ.. చిరు వ్యాపారులను ఇబ్బంది పెట్టవద్దని పోలీసులకు సూచించారు. రాచకొండ సీపీ సుధీర్‌బాబుకి ఫోన్ ద్వారా మధుయాష్కిగౌడ్ మాట్లాడి చిరువ్యాపారం చేసుకునే వారిపై ఎలాంటి కేసులు పెట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

టీబీ నిర్మూలనకు కృషి చేస్తున్నాం

మన్సూరాబాద్: జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (జీఎస్ఐటీఐ)లో రాష్ట్ర టీబీ సెల్ ని-క్షయ శివిర్ స్క్రీనింగ్ క్యాంపును గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జీఎస్ఐటీఐ డీడీజీ హెడ్ డా. ఎస్.రవి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2025 నాటికి టీబీని నిర్మూలించాలనే ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని సాధించడంతో జీఎస్ఐటీఐ తన వంతు పాత్రను పోషిస్తుందన్నారు. టీబీ సెల్‌లోని మెడికల్ ఉద్యోగులు ని-క్షయ శివిర్ స్క్రీనింగ్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలన్నారు. రోగ నిర్ధారణతో పాటు ముందస్తుగా టీబీని గురించేందుకు టీబీ స్క్రీనింగ్ క్యాంపులు తోడ్పాటును అందిస్తాయని తెలిపారు. అనంతరం టీబీ స్టిగ్మాపై టీబీ మెడికల్ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా టీబీసెల్ డా. అయేషా, డా. ఆదిత్య, డా. వాసుప్రసాద్, డా. విల్సన్‌కుమార్‌లతో పాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.



స్క్రీనింగ్ క్యాంపులో పాల్గొన్న జీఎస్ఐటీఐ డీడీజీ రవి, రంగారెడ్డి జిల్లా టీబీ సెల్ వైద్యులు

టెన్త్ విద్యార్థులకు మోటివేషన్ తరగతులు



మల్కాజిగిరి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఏడుకొండల్‌ను సన్మానిస్తున్న అధికారులు

దిల్‌సుఖ్‌నగర్: ప్రతి విద్యార్థి జీవితంలో 10వ తరగతి పరీక్షలు అత్యంత కీలకమైనవని, పరీక్షలను కష్టంతో కాకుండ ఇష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని మల్కాజిగిరి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఏడుకొండలు అన్నారు. గురువారం షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లాలోని ఎస్సీ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు కొత్తపేటలోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో మోటివేషన్ తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏడుకొండలు హాజరై మాట్లాడుతూ... ఆత్మ విశ్వాసంతో ప్రతి సబ్జెక్టుపై అవగాహనతో చదవాలని ఆయన సూచించారు. మానసిక వ్యక్తిత్వ నిపుణుడు సిహెచ్ బాలకృష్ణ మాట్లాడుతూ... ప్రతి విద్యార్థి ధృడ విశ్వాసంతో సమయ పాలన పాటించి ఒక లక్ష్యంతో చదవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి జె.రామారావు, ఇబ్రహీంపట్నం ఏఎస్‌డబ్ల్యూఓ కుసుమ లావణ్య, చేవెళ్ల ఏఎస్‌డబ్ల్యూఓ వెంకట్ జిల్లాలోని వివిధ వసతిగృహ సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఇన్నోవేషన్ ఫెయిర్



వనస్థలిపురం ఉన్నత పాఠశాలలో ఇన్నోవేషన్ ఫెయిర్‌లో పాల్గొన్న హెచ్‌ఎం దుర్గాలత, ఉపాధ్యాయులు

వనస్థలిపురం: వనస్థలిపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఇన్నోవేషన్ ఫెయిర్‌ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు 30 ప్రాజెక్టులను ప్రదర్శించి వాటి గురించి వివరించారు. ఉత్తమ ప్రాజెక్టును ఏర్పాటు చేసిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు దుర్గాలత మాట్లాడుతూ.. ఇటువంటి ప్రదర్శనలు విద్యార్థుల్లో దాగి వున్న సృజనాత్మక శక్తిని బహిర్గతం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అగస్త్య ఫౌండేషన్ ఇగ్నేటర్ రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ పందిరి దిమ్మె కూల్చివేత

అడ్డుకోవడంతో మిగతా దిమ్మెలు కూల్చివేయకుండా వెనుదిరిగిన అధికారులు

వనస్థలిపురం: వనస్థలిపురం సచివాలయనగర్‌లోని పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రధాన గేటు ముందు నాలుగు స్తంభాలతో నిర్మించనున్న పందిరి నిర్మాణాన్ని గురువారం ఎల్‌బీనగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేయడం వివాదాస్పదమైంది. దేవాలయం ముందు రోడ్డుపై అక్రమ నిర్మాణం చేస్తున్నారంటూ సచివాలయనగర్ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు ఫిర్యాదు చేయడంతో టౌన్‌ప్లానింగ్ ఏసీపీ విజయశ్రీ నిర్మాణంలో ఉన్న దిమ్మెను కూల్చివేయించారు. దీనిని దేవాలయం కమిటీ, వీహెచ్‌పీ కమిటీ ప్రతినిధులు అడ్డుకోవడంతో మిగతా దిమ్మెలను కూల్చివేయకుండా వారు వెనుదిరిగారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కే.లక్ష్మయ్య, తదితరులు మాట్లాడుతూ.. దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా దేవాలయం, కొత్తపేటలోని అష్టలక్ష్మి దేవాలయం వద్ద లేని అభ్యంతరాలు ఇక్కడ ఎందుకని ప్రశ్నించారు. ఈ విషయంపై న్యాయ పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గణేష్ దేవాలయం చైర్మన్ బి.అశోక్‌కుమార్‌గౌడ్, వెంకటేశ్వరస్వామి దేవాలయం ప్రతినిధులు సత్యనారాయణ, పాపారావు, రమేష్, అనూప్‌కుమార్, శ్రీధర్, వెంకటేశ్వర్‌రావు, వీహెచ్‌పీ ప్రతినిధులు యాదగిరిరావు, గణేష్‌నాయుడు పాల్గొన్నారు.



వనస్థలిపురంలో దేవాలయం వద్ద కూల్చివేసిన దిమ్మెను చూపిస్తున్న ఆలయ ప్రతినిధులు

ఆనంద్‌కుమార్ కుటుంబీకులకు ఈటల పరామర్శ



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్, కార్పొరేటర్ ప్రేమ్

చైతన్యపురి: కుంభమేళాకు వెళ్లి వస్తూ మధ్యప్రదేశ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైన గోల్కొండ ఆనంద్‌కుమార్ కుటుంబ సభ్యులను గురువారం రాత్రి మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ పరామర్శించారు. గడ్డిఅన్నారం డివిజన్ వీవీనగర్ కాలనీలోని ఆనంద్‌కుమార్ ఇంటికి వెళ్లి ఆయన భార్య రాధ, పిల్లలను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, విశ్వబ్రాహ్మణ సంఘం మాజీ అధ్యక్షుడు కీర్తిగారి అనంతాచారి, బీజేపీ నాయకులు దాసరి మల్లేశం, నీల ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేస్‌కోర్స్ తరలింపు ఎప్పుడు?



మలక్‌పేటలోని రేస్‌కోర్స్‌లో రేసును వీక్షిస్తున్న జూదరులు (ఫైల్ ఫొటో)

చాదర్‌ఘాట్: ప్రభుత్వము ఏర్పడిన ఆరు నెలలకే మలక్‌పేటలోని హైదరాబాద్ రేస్‌కోర్స్‌ను తరలించి మూసీ నిర్వాసితులకు ఇండ్లుతో పాటు మైనారిటీ గురుకుల పాఠశాలలు, స్కిల్ టవర్స్ ఏర్పాటు చేస్తామని హడావుడి చేసి ప్రకటన చేసిన ప్రభుత్వం ఇప్పటి వరకు తరలింపు ఊసే లేదు. మలక్‌పేట రేస్‌కోర్స్ దాదాపు 170 ఎకరాల విస్తరణతో కలిగి ఉన్నది. దాదాపు సంవత్సరానికి ప్రభుత్వానికి పన్ను రూపంలో వందల కోట్లు చెల్లిస్తోంది. అదే విధంగా జీహెచ్‌ఎంసీకి ప్రాపర్టీ ట్యాక్స్ రూపంలో సంవత్సరానికి రూ.65లక్షలు చెల్లింపులు జరుగుతాయి. ఇంత ఆదాయం ప్రభుత్వానికి వస్తుంటే తరలింపు సాధ్యమేనా అని స్థానికులు అనుకుంటున్నారు. రేస్‌కోర్స్ తరలింపు అంటే భారతదేశంలోనే 2వ స్థానంలో హైదరాబాద్ రేస్‌కోర్స్‌కు స్థానం ఉంది. ప్రపంచదేశాల నుంచి ఈ రేసుకు తరలివచ్చి రేసును ఆహ్వానిస్తారు. ఇంత ప్రాధాన్యత ఉన్న రేస్‌కోర్స్‌ను తరలించటానికి ప్రభుత్వం సాహసం చేస్తుందా అనేది ఊహకందని సమాధానం.

బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే తరలింపు ప్రకటన

బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే రేస్‌కోర్స్‌ను చంచల్‌గూడ జైలును తరలించి హైటెక్ టవర్స్ నిర్మాణం చేసి పాతబస్తీవాసులకు ఉపయోగపడే విధంగా సమకూర్చుతామని అప్పటి మాజీ హోంమంత్రి పదేపదే పలు సమావేశాలలో బహిరంగ సభలలో తెలియజేశారు. రాజకీయ ఒత్తిడి వలనో లేక స్థల సేకరణలో ఇబ్బందులు తలెత్తాయో కానీ తరలింపు వాయిదా పడింది.

వృద్ధురాలి అదృశ్యం



కొర్ర బడిలి (ఫైల్)

మలక్‌పేట: ఓ వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సలీంనగర్ బంజారాకాలనీకి చెందిన కొర్ర బడిలి(67) ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి సాయంత్రం వస్తానని చెప్పి ఇంటికి చేరుకోలేదు. దీంతో చుట్టు పక్కల తెలిసిన వారి వద్ద ఆమె కోసం వెతికిన ఆచూకీ దొరకలేదు. దీంతో ఆమె కుమారుడు రామ్‌జీ మలక్‌పేట పోలీసులను ఆశ్రయించాడు. తన తల్లి జ్ఞాపకశక్తి లోపంతో పడుతుందన్నారు. గతంలో ఇలాగే బయటకి వెళ్లి తిరిగి వచ్చిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫేక్ వెబ్‌సైట్‌లో రూమ్ బుక్ చేసి మోసపోయిన కస్టమర్

- చాదర్‌ఘాట్ పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

చాదర్‌ఘాట్: వెబ్‌సైట్‌లో రిసార్ట్‌లో రూమ్ బుక్ చేసిన కస్టమర్ ఫేక్ అని తెలియడంతో చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్సై భరత్ తెలిపిన వివరాల ప్రకారం.. అజంపురా ప్రాంతానికి చెందిన మహ్మద్ అబ్దుల్ ఇసాన్ రెండు రోజుల క్రితం వెబ్‌సైట్‌లో చూసి గోల్కొండ రిసార్ట్‌లో రూమ్ బుక్ చేసుకొని అడ్వాన్స్‌గా రూ.20వేలు చెల్లించాడు. వెబ్‌సైట్ నుంచి కస్టమర్‌కు రూమ్ కన్‌ఫామ్ అయ్యిందని మిగతా బ్యాలన్స్ రూ.20వేలు చెల్లించి రూమ్ హ్యాండోవర్ చేసుకోవాలని తెలపటంతో కస్టమర్ రూ.20వేలు చెల్లించాడు. కుటుంబంతో అబ్దుల్ ఇసాన్ బుధవారం గోల్కొండ రిసార్ట్‌కు వెళ్లగా అక్కడ గోల్కొండ లేదు రిసార్టు లేదని తెలుకున్నాడు. వెబ్‌సైట్ చూసే సరికి ఫేక్ వెబ్‌సైట్ అని తెలియడంతో చాదర్‌ఘాట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి రెండు రోజుల జైలు

లింగోజిగూడ: మూడోసారి డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష పడింది. ఎల్‌బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం ఎల్‌బీనగర్ నాగోలుకు చెందిన ఎస్.చంద్రన్న ఈ నెల 11వ తేదీన డ్రంకన్ డ్రైవ్‌లో పోలీసులకు చిక్కాడు. చంద్రన్న గతంలో కూడా డ్రంకన్ డ్రైవ్‌లో రెండు సార్లు పట్టుబడ్డాడు. చంద్రన్నను కోర్టులో హాజరు పరచారు. మూడుసార్లు పట్టుబడటంతో ఎల్‌బీనగర్ 6వ స్పెషల్ ఎంఎం కోర్టు అతడికి రెండు రోజుల జైలు శిక్ష విధించింది. 2025 జనవరి నెల నుంచి ఈనెల 12వ తేదీ వరకు మొత్తం 604 డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. వారందరిని కోర్టులో హాజరపరుచగా 13మందికి ట్రాఫిక్ డ్యూటీ, ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. మిగిత వారికి సుమారు రూ.8లక్షల వరకు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

శ్మశానవాటికను కుల సంఘాలకు కేటాయించొద్దు

తహసీల్దార్‌కు గ్రామ పెద్దల వినతి

బడంగ్‌పేట్: బడంగ్‌పేట్‌లోని శ్మశానవాటిక స్థలాన్ని కుల సంఘాలకు కేటాయించొద్దని కోరుతూ గురువారం బాలాపూర్ తహసీల్దార్‌కు గ్రామస్తులు, పెద్దలు వినతిపత్రం అందజేశారు. సర్వే నంబర్ 110లోని 6 ఎకరాల 23 గుంటల భూమిని గతంలో గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు కేటాయించినట్లు గుర్తుచేశారు. 1953-54 నాటి నుంచే ఆర్‌ఓఆర్ కాస్ర పహాణీ రికార్డుల్లో ఉందని తెలిపారు. ప్రస్తుతం ఈ శ్మశానవాటికలో గ్రామం, పరిధి 90కిపైగా కాలనీలలో ఎవరూ చనిపోయినా.. దహన సంస్కారాలు ఇక్కడే జరుగుతాయని పేర్కొన్నారు. ఇలాంటి వైకుంఠ ధామాన్ని కుల సంఘాలకు ఇతర ఏ అవసరాలకు కేటాయించకుండా చూడాలని విన్నవించారు. వినతి పత్రం ఇచ్చినవారిలో సూర్ణగంటి అర్జున్, పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, భీమిడి జంగారెడ్డి, పెద్దబావి దర్శన్‌రెడ్డి, లిక్కి కృష్ణారెడ్డి, బంగారు ప్రభు, శ్రీనివాస్, కొండల్, సాయి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

మలక్‌పేట: ప్రజలు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. పంజేషాహలోని క్యాంపు కార్యాలయంలో గురువారం కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అంబర్‌పేట మండలంలో 99 మందికి, చార్మినార్ మండలంలో 75 మందికి చెక్కులు అందజేశామన్నారు. పేదింటి ఆడబిడ్డలకు ఈ పథకం వరం లాంటిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ తహసీల్దార్ నీహారిక, డిప్యూటీ తహసీల్దార్ మన్సూర్, ఆర్ఐలు అరుణ, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థ భారతి సిమెంట్



మేస్త్రీలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

లింగోజిగూడ: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా భారతి సిమెంట్ ఎదుగుతోందని భారతి సిమెంట్ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ బద్రి పేర్కొన్నారు. బండ్లగూడలోని మహాలక్ష్మి స్టీల్ ట్రేడర్‌లో గురువారం నిర్వహించిన తాపీ మేస్త్రీల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతి సిమెంట్ అల్ట్రాఫస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5స్టార్ గ్రేడ్ తెలంగాణలో విడుదల చేసిందన్నారు. ఇతర సిమెంట్‌ల కంటే భారతి అల్ట్రా సాఫ్ట్‌తో నిర్మాణం వేగవంతంగా జరుగుతుందని తెలిపారు. అల్ట్రా సాఫ్ట్ వినియోగదారులకు ఉచిత సహాయం అందజేస్తామని పేర్కొన్నారు. నిపుణులైన సిమెంట్ ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సలహాలు, సహాయం అందజేస్తారని తెలిపారు. ఇతర సిమెంట్ల కంటే భారతి అల్ట్రా సాఫ్ట్ రూ.20 అదనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీలర్ బాల్‌రాజ్, 50మంది మేస్త్రీలు పాల్గొన్నారు.

మిర్చి రైతులు ధరలు తెలుసుకునే మార్కెట్‌కు రావాలి

రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ అధికారి రాజశేఖర్‌రెడ్డి

చాదర్‌ఘాట్: మిర్చి ధర తగ్గుదల నేపథ్యంలో రైతులు నష్టపోకుండా మార్కెట్‌కు వచ్చే ముందు అధికారులు, కమిషన్ ఏజెంట్లు, వ్యాపారస్తులకు ధరల విషయం తెలుసుకొని మార్కెట్‌కు రావాలని రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ అధికారి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లోని మిర్చియార్డ్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ధరల తగ్గుదల విషయంలో ప్రతి మార్కెట్ యార్డు ఒక ప్రత్యేక అధికారిని నియమించిందన్నారు. అందువలన మిర్చి మార్కెట్‌ను అధికారులతో కలిసి పరిశీలించామని తెలిపారు. ఈ నెలలో పంటలు అన్ని ఒకేసారి రావటంతో ధరలు కొంత మేరకు తగ్గాయని తెలిపారు. అదే విధంగా రైతులతో ధరలు ఎలా ఉన్నాయి అని అడిగి పలు సూచనలు చేశారు. మిర్చి రేటు పెరుగుదల వరకు అధికారులు రైతులతో సమన్వయం చేసుకోవాలని ఎస్‌జీఎస్‌కు, గ్రేడ్-1 అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు దామోదర్, చిలుక నర్సింహారెడ్డి, పుష్ప, మాధురి, సిబ్బంది పాల్గొన్నారు.



మలకపేట గంజిలో మిర్చి మార్కెట్ యార్డును పరిశీలిస్తున్న ఆర్‌జేడీ రాజశేఖర్‌రెడ్డి తదితరులు

గిరిజనుల సంక్షేమానికి కృషి

- మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

మహేశ్వరం: గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. గురువారం మహేశ్వరం మండలానికి చెందిన కాంగ్రెస్ గిరిజన నాయకులు కేఎల్లార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 15న నిర్వహించే సేవాలాల్ జయంతిలో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంజారాల ఆరాధ్య గురువు సంత్ సేవాలాల్ మహరాజ్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సేవాలాల్ సిద్ధాంతాలను ఆచరించాలని సూచించారు. కార్యక్రమానికి తప్పకుండా వస్తానని హామీనిచ్చారు. అదేవిధంగా గిరిజన కాంగ్రెస్ నాయకులు పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి జయంతి కార్యక్రమానికి ఆహ్వానించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యులు నేనావత్ ఈశ్వర్ నాయక్, బొక్క జంగారెడ్డి, నాయకులు నేనావత్‌రాజు నాయక్, అంధ్యా నాయక్, పాండు నాయక్, కృష్ణా నాయక్, సేవ్యా నాయక్, కె.రాజు నాయక్, దస్రునాయక్, రవినాయక్, హేమ్లా నాయక్, గోపాల్ నాయక్, దేవేందర్ నాయక్, లక్ష్మణ్ నాయక్, మున్యా నాయక్, రవి, భాస్కర్, శ్రీను, రామునాయక్, భరత్, రాజు ఉన్నారు.

దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్ట్

లింగోజిగూడ: జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించి ఎల్‌బీనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం దొంగలింగాల గ్రామానికి చెందిన కాట్రవత్ నవీన్‌కుమార్ (20) లేబర్‌గా పనిచేస్తూ ఎల్‌బీనగర్‌లోని మజీద్‌గల్లీలో నివాసం ఉంటున్నారు. సూర్యాపేట జిల్లా కోదాడకు బంజారాకాలనీకి చెందిన వంటిపులి గోపి (27) కూలీగా పని చేస్తూ ఎల్‌బీనగర్ మజీద్ గల్లీలో నివాసం ఉంటున్నారు. ఇద్దరూ మద్యానికి బానిసై సునాయాసంగా డబ్బులు సంపాదించాలన్న అత్యాశతో ఒంటరిగా వెళ్లే వారిని ఆటోలో ఎక్కించుకుని వారి వద్ద ఉన్న నగదు సెల్‌ఫోన్లను లాక్కుని నిర్మానుష్య ప్రాంతాలలో వదిలేసి పోతుంటారు.

- సూర్యాపేట జిల్లా నకిరేకల్ ప్రాంతానికి చెందిన ఆర్.వెంకటేశ్వర్లు (45) ఈనెల 9న నగరంలోని పెద్దమ్మగుడి దగ్గర సమీప బంధువుల ఫంక్షన్‌కు వెళ్లి వస్తుండగా అదేరోజు రాత్రి 8గంటలకు ఎల్‌బీనగర్ మెట్రో స్టేషన్ దగ్గర దిగి నకిరేకల్ వెళ్లేందుకు బస్సు ఎక్కేందుకు ఎల్‌బీనగర్ ఎక్స్‌రోడ్డుకు వెళ్లేందుకు ఆటోను ఆపుతుండగా వేగంగా వచ్చిన ఆటోడ్రైవర్ వెంకటేశ్వర్లును ఆటోలోకి ఎక్కించుకుని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అతని వద్ద నగదు తోపాటు, సెల్‌ఫోన్‌ను లాక్కుని వదిలేసి వెళ్లిపోయారు. బాధితుడు ఎల్‌బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి సెల్‌ఫోన్, వేయి రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.



పోలీసుల అదుపులో నిందితులు

నేడు స్పోర్ట్స్ మీట్ ముగింపు వేడుకలు

చంచల్‌గూడ: తెలంగాణ జైళ్ల శాఖ 7వ స్పోర్ట్స్ మీట్ ముగింపు సమావేశాలకు తెలంగాణ ముఖ్యకార్యదర్శి శాంతికుమారి, ఆర్‌అండ్‌బీ శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన దాసరి ముఖ్యఅతిథులుగా విచ్చేయనున్నారు. ఈ వేడుకలు శుక్రవారం చంచల్‌గూడలోని సీకా మైదానంలో సాయంత్రం 4గంటలకు ప్రారంభం కానున్నట్లు అధికారులు తెలిపారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో.. టమాట 11, వంకాయ 18, బెండ 35, పచ్చి మిర్చి 25, కాకర 32, బీర 35, క్యాబేజి 9, ఫ్రెంచిబీన్స్ 35, క్యారెట్ 17, దొండ 25-35, చిక్కుడు 28, గోకర 28, బీట్‌రూట్ 17, క్యాప్సికం 28, ఆలుగడ్డ 22, దోస 20, సొరకాయ 7, పొట్లకాయ 18, ఉల్లిగడ్డ 34, చామగడ్డ 45లుగా ఉన్నాయి.
గమనిక: ఈ ధరలు శుక్రవారం ఉదయం 9గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

మొండి బకాయిదారుల ఆస్తులను జప్తు చేస్తాం

మలక్‌పేట డిప్యూటీ కమిషనర్ జయంత్



చాదర్‌ఘాట్: ఆస్తి పన్ను చెల్లించని మొండి బకాయిదారుల ఆస్తులను జప్తు చేస్తామని మలక్‌పేట సర్కిల్-6 డిప్యూటీ కమిషనర్ జయంత్ తెలిపారు. గురువారం సర్కిల కార్యాలయంలో మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆస్తి పన్ను చెల్లించకుండా మొండికేస్తున్న వారిపై కఠిన చర్యలు కాకుండా ఆస్తులు కూడా జప్తు చేస్తున్నామని తెలిపారు. కొంత మందికి అవగాహన కూడా కల్పిస్తున్నామని తెలిపారు. దాదాపు 325 మందికి రెడ్ నోటీసులు జారీ చేశామని అన్నారు. మార్చి 31లోగా ఆస్తిపన్ను చెల్లించాలని టెలిఫోన్ ద్వారా సమాచారము అందజేస్తున్నామని తెలిపారు.

సేవాలాల్ జయంతి వేడుకలకు విరాళం



సేవాలాల్ సంఘం నాయకులకు విరాళాన్ని అందజేస్తున్న ఉపేందర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: ఎన్‌టీఆర్ నగర్ పరిధిలో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకల్లో నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి గురువారం కాంగ్రెస్ నాయకుడు ఉపేందర్‌రెడ్డి విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్యా నాయక్, రాజు నాయక్, నరసింహబాలు నాయక్, ప్రేమ్‌నాయక్, భాస్కర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధికి ఊతంగా కౌశల్ మేళా

సాక్షి, సిటీబ్యూరో: పరిశ్రమ సంబంధిత నైపుణ్యాలను అందించడం ద్వారా గ్రామీణ యువతకు సరైన ఉపాధి అవకాశాలను చేరువ చేయడమే లక్ష్యంగా వెల్‌స్పన్ ఫౌండేషన్ కౌశల్ మేళాను నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా దిల్‌సుఖ్‌నగర్ ప్రాజెక్ట్ సెంటర్‌లో గురువారం కౌశల్ మేళా స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వెల్‌స్పన్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొని వివరాలు వెల్లడించారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, రిటైల్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, మేసన్-టైలింగ్, ప్లంబర్ - జనరల్ వంటి కోర్సులలో ప్రత్యేక శిక్షణను యువతకు అందించనున్నట్లు తెలిపారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

వనస్థలిపురం: వనస్థలిపురం హిల్‌కాలనీలోని బచ్‌పన్ అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవాన్ని గురువారం 'రిథమ్స్ ఆఫ్ జాయ్' పేరిట ఘనంగా నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ బచ్‌పన్ అకడమిక్స్ రీజినల్ డైరెక్టర్స్ శ్రీకాంత్‌రెడ్డి, రూపారెడ్డి, రీజినల్ ఆపరేషన్స్ అండ్ టెక్నాలజీ డైరెక్టర్ కే.కౌశిక్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు వాళ్లలో ఉత్సాహం, మనోవికాసాన్ని పెంచుతాయని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను విశేషంగా అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.కల్పవల్లి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన